# ప్రేమకు అటువైపు

కథ

కస్తూరి మురళీకృష్ణ



ఎవరైనా 'ప్రేమ' అన్న పదం ఉచ్చరిస్తే నాకు సోలమన్, మేరీలే గుర్తుకు వస్తారు. ఆవెంటనే ప్రేమకు ఆ వైపున్న రేమండ్, సుజాతలు గుర్తుకు వస్తారు. అందుకే మీకూ ఈ కథ చెప్పక తప్పదని అనిపించి ఎలా జరిగిందో అలాగే ఎటువంటి అతిశయోక్తులు, కల్పనలు లేకుండా చెప్తున్నాను.

** ** **

"అటు చూడు, వాళ్ళమధ్య పొడుగ్గా, నల్లగా ఉన్నాడు...వాడిపేరు సోలమన్" చూపించాడు నా కొలీగ్ రాజు.

ఆ వైపు చూశాను. తన మిత్రులతో ఏదో మాట్లాడుతూ నవ్వుతున్నాడు సోలమన్. అయితే అతడిని నాకంత ప్రత్యేకంగా చూపించాల్సిన అవసరం ఏముందో నాకు అర్థం కాలేదు. క్షణంలో ఆ సందేహాన్ని రాజు మాటలు పటాపంచలు చేసేశాయి.

"మీ సెక్షన్‌లో మేరీ మోజెస్ ఉంది చూడు, ఆమె ఒకప్పటి లవర్ వీడు".

మేరీ నా సెక్షన్‌లోనే పని చేస్తోంది. మంచి అమ్మాయి. ఒక్కసారి సీట్లోకి వచ్చి కూర్చుందా, మళ్ళీ లంచ్‌లోనే తల ఎత్తేది. ఆ తరువాత ఇంటికి వెళ్ళాల్సి వచ్చినప్పుడే సీట్లోంచి కదలుతుంది. ఎవరితో ఎక్కువగా మాట్లాడదు. ఎవరైనా పలకరిస్తే నవ్వుతూ మాట్లాడుతుంది, అదీ అవసరమైనంత వరకే!

ఆమె గురించి వాళ్ళ ద్వారా వీళ్ళ ద్వారా తెలిసిందేమిటంటే, పెళ్ళికి ముందు ఎవరితోనో ఎఫైర్ ఉండేదని, పెళ్ళయిన తరువాత కూడా అలాగే కొనసాగిస్తూంటే ఆమె భర్త వదిలేశాడని- కానీ అమ్మాయిని చూస్తే అలాగనిపించదు. ఇప్పుడు రాజు చెప్తూంటే అదంతా గుర్తుకు వచ్చింది.

"ఇదినిజమేనా?" అడిగాను రాజును.

రాజు చెప్పిన తరువాత అది అబద్ధం ఎలాఅవుతుంది? వీళ్ళిద్దరూ పెళ్ళికి ముందు చర్చి 'కాయిర్'లో పాడేవారట. అలా అయిన పరిచయం ప్రేమగా మారింది. మరి ఎందువల్లో పెళ్ళి కుదరలేదు. పెళ్ళయిన తరువాత అమ్మాయి బుద్ధిగా ఉండేదేనేమో, కానీ సోలమన్ ఉండనివ్వలేదు. ఇంటికి వెళ్ళి గోల చేసేవాడట, తనతో వచ్చేయమని వేధించేవాడట. ఆమె భర్త రేమండ్‌ని కూడా వేధించి తన్నులు తిన్నాడు. దెబ్బకు దయ్యమైతే వదిలింది కానీ, రేమండ్ విసిగి మేరీని వదిలేశాడు. వాడు నా ఫ్రెండే, ఎంతో చెప్పి చూశాను. ఎందుకో వాడి మనసు విరిగిపోయింది. భార్యను వదలనైతే వదిలాడు కానీ పాపం పిచ్చివాడిలా అయిపోయాడు. ఇక జన్మలో పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూచున్నాడు. వాడిని చూస్తే బాధగా అనిపిస్తుంది. రాజు సానుభూతి కురిపించేస్తున్నాడు. కానీ నాకు విషయం పూర్తిగా అర్థం కాలేదు.

రాజూ! నిజం చెప్పు... సోలమన్ మేరీని ప్రేమించాడు. మేరీ రేమండ్‌ని పెళ్ళి చేసుకుంది. సోలమన్ వెళ్ళి గోల చేశాడు. రేమండ్ మేరీని వదిలేశాడు. అవునా?"

"అవును! దీన్లో అర్థం కానిదేముంది?"

"ఇంకా సోలమన్ పెళ్ళి కాలేదు. ఇప్పుడు మేరీ ఒంటరిగా ఉంటోంది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటే కథ సుఖాంతం అవుతుందిగా!"

రాజు భళ్ళు భళ్ళున నవ్వాడు.

"వీళ్ళదేమీ అంత గొప్ప ప్రేమ కాదు. ఏదైనా అందనంతవరకే దాని మీద మోజు ఉంటుంది. పార్వతి దొరకలేదు కాబట్టి దేవదాసుది అమరప్రేమ అయింది. కానీ పార్వతిని పొంది ఉంటే దేవదాసు అలాగే తాగి జుట్టు పీక్కుని పిచ్చివాడై ఉండేవాడు. అందరూ అమర ప్రేమికుడు బదులు హెన్‌పెక్డ్ హజ్బెండ్ అనేవారు. అంతే తేడా. ఇంకా మేరీ మీద ప్రేమతో సోలమన్ పెళ్ళి చేసుకోలేదనుకుంటున్నావా? అటువంటిదేమీ లేదు. వాడికి నచ్చిన సంబంధం దొరకలేదు. అందుకని వాడు ఓ పదహారేళ్ళ బాలసుందరి కోసం వెతుకుతున్నాడు. ఆమెకు బోలెడంత డబ్బుండాలి. ఆమె పెద్ద ఉద్యోగం చేయాలి. డబ్బు సంపా

దించాలి. భర్తకు సేవలు చేస్తూ చెప్పినట్టు విని పడి ఉండాలి. ఇదీ కథ" అని సోలమన్ మమ్మల్ని దాటివెళ్తూంటే సన్నగా పాడాడు రాజు...

'జరూరత్ హై, జరూరత్ హై ఎక్ శ్రీమతీకి, కళావతీకి, సేవా కరే జో పతీకీ' అంటూ.

నాకెందుకో బాధగా అనిపించింది. మేరీ అందరితో ఎందుకు మౌనంగా ఉంటుందో నాకు అర్థమయింది.

ఎవరితోటో పరిచయం ఉంది కదా అని కాస్త చనువుగా మాట్లాడగానే వాడు ప్రేమ అని వెంటపడి ఆమె జీవితం నాశనం చేసేశాడు. ఇప్పుడెవరితో మాట్లాడితే ఏ బాధలు కొనితెచ్చుకోవాల్సి ఉంటుందో అన్న భయంతో ముడుచుకుపోయి ఉంటుంది.

ఆరోజు నుంచీ మేరీని జాగ్రత్తగా గమనించసాగాను. నా అంచనా కరెక్టేననిపించింది. దారిలో ఎవరైనా పలకరిస్తే బెదిరిపోతుంది. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోనన్న భయం కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

నిజంగా, మన సమాజంలో మగవాడికి ఎన్ని పెళ్ళిళ్ళన్నా సులభంగా అయిపోతాయి. మనవాళ్ళు ఎన్ని ఆదర్శాలు వల్లించినా అమ్మాయి రెండో పెళ్ళి ప్రసక్తి వచ్చేసరికి ప్రతివాడూ చులకనగా మాట్లాడతాడు. డైవోర్సీ అనగానే ప్రతివాడి కళ్ళల్లో అదో చులకనభావం, ఆలోచనల్లో వెకిలితనం, అమ్మాయి ప్రవర్తన ఎంత బాగా ఉన్నా ప్రతివాడూ ఆమె సెక్స్ కోసం తపించిపోతున్నట్టే ఊహిస్తాడు.

రేపు సోలమన్ ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. మేరీ మాత్రం జీవితాంతం ఒంటరిగా ఉండిపోవాల్సివస్తుంది. ఇదేంప్రేమ? ఇందులో మేరీ దోషం ఏముందని ఆమె జీవితాంతం ఒంటరిగా బతకాలి?

నాకే ఒక చెల్లెలో, కూతురో ఉంటే, ఆమె బతుకు ఇలాగయితే... నాకు వెర్రి ఆవేశం వచ్చేసేది ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా.

అందుకే సోలమన్ కనిపించినప్పుడల్లా ఏదో సూటిపోటి మాటలనందే నాకు సంతృప్తి లభించేది కాదు.

దూరంగా మేరీ కనిపించింది. పెళ్ళిలో ఆమె ప్రవర్తన ఎంతో డిగ్నిఫైడ్‌గా ఉంది.అందరు కొలీగుల్లా వచ్చింది. విష్ చేసింది. డిన్నర్ చేసింది. వెళ్ళిపోయింది. మరి నాకెందుకీ ఆవేశం? నాకెందుకీ అనవసరపు ఆలోచనలు?

ఇంతలో ఓ రోజు సోలమన్ పెళ్ళి పత్రిక పట్టుకొచ్చాడు.

"సార్...! నా పెళ్ళి... తప్పకుండా రావాలి" అన్నాడు.

అమ్మాయి పేరు చూశా... ఎవరో సుజాతా సామ్యూల్.

"కంగ్రాట్స్". నాలిక చివర్నుంచి వచ్చిందామాట. "నువ్వు మేరీని పెళ్ళి చేసుకుంటావనుకున్నాను" అనౌచిత్యమని తెలిసినా అనకుండా ఉండలేకపోయాను. సోలమన్ వెర్రినవ్వు నవ్వాడు. భుజాలెగరేసి వెళ్ళిపోయాడు.

నేను మేరీవైపు చూశాను.

ఆమె తల ఎత్తకుండా పని చేసుకుంటోంది. ఆమె మనసులో ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు.

మనుషులు ఇంత నిర్లిప్తంగా ఎలా ఉండగలుగుతారో! ఒక పక్క ఆమె పెళ్ళయిన తరువాత కూడా వెంటపడి ఆమె జీవితం నాశనం చేశాడు. ఇప్పుడు హాయిగా వేరే ఎవర్నో పెళ్ళి చేసుకుంటున్నాడు. ఈమెకేమీ అనిపించదా?

సోలమన్ పెళ్ళికి వెళ్ళకూడదనిపించినా వెళ్ళాను, పెళ్ళి కూతురుని చూడాలని.

నిజంగా 'ముగ్ధ' అనే పదం ఆమెకి సరిపోతుంది. అప్పుడే అరవిరిసిన మందారంలా ఉంది. ఉదయపు సూర్యకిరణాల్లో మెరిసే ఆకుల కొసల నిలబడ్డ నీటి బిందువులా ఉంది.

ఎందుకో నా గుండె గొంతుకలో కొట్టుకోసాగింది. నిజంగా, ఆడవాళ్ళ జీవితాలు ఎంత సున్నితమైనవి. ఒక్క క్షణం వరకూ పంచరంగుల కలలు కనే సీతాకోక చిలకల్లా ఉంటారు, పెళ్ళయిన మరుక్షణం... వాళ్ళ జీవితం మొత్తం మారిపోతుంది. మంచి భర్త దొరికితే అదో రకం... లేకపోతే...

దూరంగా మేరీ కనిపించింది. పెళ్ళిలో ఆమె ప్రవర్తన ఎంతో డిగ్నిఫైడ్‌గా ఉంది. అందరు కొలీగుల్లా వచ్చింది. విష్ చేసింది. డిన్నర్ చేసింది. వెళ్ళిపోయింది. మరి నాకెందుకీ ఆవేశం? నాకెందుకీ అనవసరపు ఆలోచనలు?

నాకీ గొడవలన్నీ ఎందుకన్నట్టు డెప్యుటేషన్ మీద నన్ను రెండేళ్ళకోసం ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ చేశారు.

ఢిల్లీలో ఏ ప్రేమ జంటను చూసినా నాకు సోలమన్, మేరీలే గుర్తుకు రాసాగారు. పిచ్చివాడిలా తిరుగుతున్న రేమండ్, ఒంటరిగా బతుకుతున్న మేరీ కళ్ళముందు నిలిచేవారు

"ఏమిటీ పనికిరాని ప్రేమలు" అన్న ఆలోచన వచ్చేది. క్షణిక ఆకర్షణల వెంట పడి వీళ్ళు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అనిపించేది.

డెప్యుటేషన్ పూర్తి కాగానే తిరిగి వచ్చేశాను. ఆఫీసులో అడుగు పెడుతుంటేనే నాకు తెలిసిన మొదటివార్త- సోలమన్, మేరీలు పెళ్ళి చేసుకున్నారని! ఆశ్చర్యపోయాను.

మొత్తానికి వాళ్ళిద్దరూ కలిశారని ఆనందించాను. అంతలో సుజాత ఏమయిందన్న ఆలోచన కలిగింది.

రాజుకు వెతికి పట్టుకుని అడిగాను.

పెద్దగా నవ్వాడు.

"నువ్వు లేనప్పుడు మంచి డ్రామా జరిగిందనుకో. కలిసి ఉన్న మూడు నెలలూ ప్రతి చిన్న విషయానికీ తగాదాలే. మూడు నెలల తరువాత "నాకు పెళ్ళి వద్దు, పాడూ వద్దు" అని పారిపోయింది సుజాత. వీడిమీద హరాస్‌మెంట్ కేసు పెట్టింది. చివరికి, నేను ఇంకో ఇద్దరం ఆఫీసర్లం ఇన్వాల్వ్ అయి పోలీసు కేసు కాకుండా చూశాం. తరువాత సోలమన్‌ను, సుజాతను కూచోపెట్టి సంధి చేయాలని చూశాం. కుదరలేదు. ఆ అమ్మాయి మానసికంగా ఎందుకో గాయపడింది. జన్మలో మగవాడన్న వాడిని దగ్గరకు రానీయనంది. అందరం పూనుకుని మ్యూచ్యువల్ డైవోర్స్ ఇప్పించాం. ఆమె ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయింది.



పాపం, మూడు నెలల్లో మూడు జీవితాల భయంకర అనుభవాలు పొందినట్టుంది!

"మరి మేరీనెలా చేసుకున్నాడు సోలమన్?" అడిగాను.

"అదీ నేనే కుదిర్చా! సోలమన్‌ను దగ్గర తీసి చెప్పా- "బాబూ! నీకు ఈమెతో ముడిపడి ఉంది. ఆమెతో తప్ప నువ్వు ఎవరితో సుఖంగా ఉండలేవు. నీ అందమైన డబ్బున్న అమ్మాయి ఆశలు వదిలెయ్. మేరీని చేసుకో. ఇద్దరూ సుఖంగా ఉంటారని నచ్చచెప్పా. వాడికి గత్యంతరం లేదు. మేరీ కూడా కాస్త నచ్చచెప్పగానే ఒప్పుకుంది. ఒప్పుకోక ఏంచేస్తుంది? వీడివల్ల జీవితంలో దెబ్బతిన్నది. వేరేవాళ్ళు ఎవరైనా ఆ గాయాన్ని రేపేవాళ్ళే తప్ప తగ్గించేవారు కారు. ఇప్పుడిద్దరూ హాయిగా ఉన్నారు. మొత్తానికి ఇద్దరిదీ గట్టి ప్రేమనే. అటూ, ఇటూ తిరిగి ఇద్దరూ కలశారు. అదీ నిజమైన ప్రేమ! రాజు ఇంకా ఏదో చెప్తూ పోతున్నాడు. కానీ నాకు అదేదీ వినపడటం లేదు. ఇన్నాళ్ళు మేరీ పడ్డ బాధలకు ఫలితం లభించింది. మేరీ, సోల మన్‌ల పవిత్ర ప్రేమ నిరూపితమై వారిద్దరూ ఒకటయ్యారు. సంతోషంగా ఉన్నారు. ప్రేమకు ఒకవైపు సంతోషంగా ఉన్న వీరిద్దరు కనపడుతున్నా, మరోవైపు జీవితాంతం రోదిస్తూ బతుకుతున్న రేమండ్, తన చేదు అనుభవాల సారంగా ప్రేమకు దూరమై, పురుషుల్ని ద్వేషిస్తూ ఒంటరిగా బతుకుతున్న సుజాతలు కనిపిస్తున్నారు.

ఏమిటీ ప్రేమలు? ఏమిటీ బతుకులు?

ఇదేనా అమర ప్రేమకు పర్యవసానం? ఇక్కడ వీళ్ళు కలసిన అమరప్రేమ జంటను ఆదర్శం అని పొగడుతున్నారు. కానీ ప్రేమకు మరోవైపు చూడటం లేదా? లేక ఈ ప్రపంచం ప్రేమకు మరోవైపు చూడాలని ఇష్టపడటం లేదా?